# ఆకాశగంగ

ఏడుకొండల వాస శ్రీ వేంకటేశా అలివేలుమంగ శ్రీ ఆకాశగంగా! ఓ ఆకాశ గంగా.... సరస్వతి వీణారవంతో మేఘుడు ద్రవించినట్లున్నాడు. మెల్లగా ప్రారంభమైన వాన కుంభవర్షమై పోయింది. ఆకాశమే చిల్లులు పడకుంటే అంత వర్షం కురుస్తుందా? పెన్న పొంగులు వారినట్లు పత్తేవారివీధి మొత్తం జలమయమై పోయినది. వాన కురుస్తున్నంత సేపూ కడింటి పిచ్చయ్యకూ అతని యెదురింటి వెంగయ్యకు జరుగుతున్న జగడాన్ని యెవ్వరూ గుర్తించనే లేదు. కారణం అత్యంత స్వల్పమైనదైనా కలహం మిన్నంటుకొన్నది. కర్రల స్థాయి నధిగమించి కత్తుల స్థాయికి చేరుకొన్నది. ఇళ్లు మొగసాలల్లో నిలబడ్డ జనాభా తిలకిస్తుండగనే వెంగయ్య భౌతిక దేహం నేలకొరిగిపోయింది.

కడింటి పిచ్చయ్య కత్తితో పొడిచాడు. వెంగయ్య తక్షణమే చనిపోయాడు. పత్తేవారి వీధిలో ప్రతి ఒక్కరూ కాకపోయినా చాలామంది చూచారు. ఆ చూచిన వారిలో సరస్వతి కూడా ఉన్నది. ఆ వాయిస్తున్న వీణ నలా వుంచి వీధి కడపలో నిలబడ్డ క్షణంలోనే ఆ సంఘటన జరిగింది. సాయకాలం భానుమూర్తి యింటికి రాగానే ఆ దారుణమైన వార్తను చెవిలో వేసింది. భానుమూర్తికి తెలియదనా? నీ కెందుకులే అంటూ ఆఫీసు గదికి వెళ్ళి పోయాడు.

వారం దాటగనే భానుమూర్తి కడింటి పిచ్చయ్య పక్షం వకాల్తా పుచ్చు కొన్నాడు. సరస్వతికి ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఇదేం ఉద్యోగం? ఈ ఆదాయంతో బ్రతకడం కంటే బిచ్చమెత్తుకొంటేనేం! గత మాసం జంగాల వీధిలోని బసవన్న మేడలో దొంగలు పడి పదివేలు దోచుకుపోతే ఆ దొంగల పక్షం వకాల్తా తీసుకొని కోర్టుకు వెళ్లాడా! ఆ కేసూ కొట్టేశారు. ఆ ముందువారమే ఒక నర్సుపై అఘాయిత్యానికి తలపడ్డ ఇద్దరు రౌడీల తరఫున హాజరయ్యాడు. వారూ తప్పు కొన్నారు. పెండ్లయినప్పటి నుండీ ఇలాంటి కేసులు తొంభై. ఎక్కడో జరిగిన వాటిని గురించి తానంతగా బాధపడకపోయినా కళ్లముందే సంభవించిన ఈ

హత్యాకాండలో హంతకుని తరఫున తన భర్తే న్యాయవాది కావడం తన కమితమైన ఆవేదనను కల్గిస్తున్నది. ఏవో మాటల సందర్భంలో యిల్లాంటి విషయాలను గురించి ప్రస్తావిస్తే 'నీకేం తెలుసు న్యాయశాస్త్రం. ఇది వృత్తి ధర్మం. ఊరుకో' అంటాడు భానుమూర్తి. భానుమూర్తి బోర్డు కట్టి నాలుగేండ్లయినా పూర్తి కాకుండానే నలభైవేలార్జించాడు. పది మంది యెదుటా ప్రతిజ్ఞ చేసి పట్టపగలే తల తరిగినా భానుమూర్తిని కుదుర్చుకొంటే చాలు. పదివేలైనా నష్టమేముంది? అట్లా స్పష్టంగా అనేవారు లేకపోయినా అంతటి ధీమా మాత్రం ఆ ప్రాంతమంతా పాదుకపోయింది.

సరస్వతి పేరుకు తగ్గట్టుగాకున్నా కొద్దిగా చదువుకొన్నది. ఆమె పరిజ్ఞాన మత్యంత పరిమితమైనది కావచ్చు కాని ఆలోచనలకు మాత్రం అవధుల్లేవు. 'న్యాయాన్ని గురించి వాదించినపుడు గదా మీరు న్యాయవాదులు. నాకు తెలిసి మీరు అన్యాయస్తుల పక్షమే వహిస్తున్నారు గనుక అన్యాయవాదు'లన్నది సరస్వతి భానుమూర్తికి కాఫీ నిస్తూ. 'న్యాయవాదంటే న్యాయమును వ్యాఖ్యానించే వాడే వెర్రిదానా' అన్నాడు భానుమూర్తి. 'ఐతే న్యాయవ్యాఖ్యాత అనండి. న్యాయవాది అనడం అన్యాయం అంటూ రెట్టించింది సరస్వతి. 'ఇదంతా నీ పిచ్చిగానీ... నీ కెందుకే ఊరుకోక' అంటూ నవ్వుతూ ఆఫీసు గదికి వెళ్లిపోయాడు భానుమూర్తి.

భానుమూర్తి అన్నట్లు సరస్వతికా ధర్మసందేహం పిచ్చిగానే పరిణమించింది. రోజూ వేంకటేశ్వరుని పటం ముందు రెండుమూడు నిమిషాలు మాత్రమే నిలబడేది రానురాను అరగంట వరకూ నిశ్చలంగా కూర్చుని వీణెను మీటుతూ, 'ఏడు కొండలవాసా శ్రీ వేంకటేశా! అలిమేలు మంగ శ్రీ ఆకాశగంగా,' అని పాడుకొంటూ ఉంటుంది. అత్తా మామలు ఈ వ్యవహారాన్ని గూర్చి అంతగా పట్టించుకోకపోయినా ఏదో ప్రమాదం పొడ సూపుతున్నట్లు మాత్రం పసిగట్టారు. మామ చక్రపాణిలో కొంత చాదస్తమున్నా మనిషి మంచివాడు. కొడుకు లాయరై బోర్డు కట్టే వరకూ కోదండరాముని గుడిలో అర్చకుడుగానే ఉన్నాడు.

'నీకు తెలియదు సరస్వతీ వక్కీలు వృత్తియే అంత. అన్యాయాన్ని న్యాయంగా, ధర్మాన్ని అధర్మంగా అధర్మాన్ని ధర్మంగా, నీతిని అవినీతిగా, అవినీతిని నీతిగా, నిజాన్ని అబద్ధంగా అబద్ధాన్ని నిజంగా నిరూపించగలవాడే లాయరు. లాయరన్నా లైయ్యరన్నా ఒకటేనమ్మా.' అంటూ మొదలు పెట్టాడు చక్రపాణీ. సరస్వతి అరటి కాయలు తరుగుతూ వింటున్నది.

'మన రాజనీతిలో సహితం అపరాధులు శిక్షించబడకుంటే ఆ పాపం రాజుకు చెందుతుందనిలేదమ్మా.'

'అపరాధులు తప్పుకొన్నా ప్రమాదం లేదు. నిరపరాధులు మాత్రం శిక్షించ బడితే రాజవంశమే నశిస్తుందని ఉందమ్మ.'

'అవునవును. దొంగలకూ హంతకులకు బుద్ధి బలాన్ని అమ్ముకోవటం ఆ సంపాదనతో జీవించడం వృత్తి ధర్మం. బాగానే వుంది మామయ్య. నాకు తెలియక అడుగుతాను. అదే దొంగలకూ హంతకులకూ కండబలం ఉన్నవాడు తోడ్పడితే శిక్షార్హుడా?'

'ఈ ధర్మసూత్రాలన్నీ నీ కర్థం కావు సరస్వతీ. ధర్మవ్యాధుని కథ చదివావా? ఎవరి వృత్తి వారిదిగదా! నువ్వు 'లా' చదివి వుంటే యిట్లా మాట్లాడవు.'

'లా' చదివిన వారల్లా న్యాయాన్ని న్యాయమనే చెబుతున్నారనా మీ భావం?'

'అఁ... అదే... అదే అట్లా చెబితే కోర్టులే వుండవు. మనవాడికి సంపాదనా వుండదు.'

'కూర తరగడం అయిందీ?' అత్తగారు పెరటిలో నుండి కేక వేసింది. సరస్వతి అరటికాయ ముక్కల్ని తీసుకెళ్లింది.

చక్రపాణికి సరస్వతిమీద గొప్ప అభిమానం. ఆమె ఇంట్లో అడుగుపెట్టిన నాటి నుండి భానుమూర్తి పట్టిన కేసల్లా బంగారమై పోతున్నది. వచ్చే కేసులు సైతం సామాన్యమైనవి కావు. పార్టీలా జేబుల నిండుకూ పచ్చనోట్లుంచు కొన్న వారే. పిచ్చయ్య వ్యవహారంలో ఫీజెంతో నిర్ణయం కాలేదు. కానీ ఎన్నివేలైనా వెనుకాడే మాట లేదు. సరస్వతి సలక్షణమైన ఇల్లాలు కాకుంటే యింత సంపదా చేకూరుతుందా? ఈనాడో రేపో కారు కూడా కొనాలంటు న్నాడు భానుమూర్తి. సుబేదార్ కాలనీలో అడుక్కి అడుగు నాలుగు రూపాయల లెక్కన ఇంటిజాగా రిజస్టరు కూడా అయిపోయింది. ఇంకో పదేండ్లు ఇట్లాగే నడిస్తే గడిస్తే కోటికి పడగెత్తినా అబ్బురమేమీ కాదు. ఏబీసీడీలు రాని నాటు పకీర్లే లక్ష లార్జించి నపుడు యం.ఏ., బి.యల్ చదివిన భానుమూర్తి కోటీశ్వరుడు కావడంలో వింతే మున్నది? ఇదంతా సరస్వతమ్మ జాతక ప్రభావమేనని చక్రపాణి గాఢ నమ్మకం.

'ఆ బెరడు నెందుకల్లా జివిరేశావ్? వాటిలో ఏవో 'విటమిన్లున్నా'యని అబ్బాయి చెబుతూనే ఉంటాడుగా!' అంటూ కూర్చున్నది జానకమ్మ. కోడలుపై తనకేమీ కక్ష లేకపోయినా అనుక్షణం తన స్థానాన్ని మాత్రం ఏదో ఒక విధంగా

భద్రపరచుకొంటూ ఉంటుంది జానకమ్మ.

'అది కాదత్తయ్యా! ఆ విటమిన్లు అరటికాయలో కాకుండా బెరడులో ఉండటం చెట్టు తప్పా! రైతు తప్పా! దేవుని తప్పా!' అన్నది నవ్వుతూ సరస్వతి.

'ఆర్డరార్డర్' అంటూ లోనికి వచ్చాడు భానుమూర్తి. 'యువరానర్' అంటూ ఫలహారాన్ని అందిచ్చింది సరస్వతి. ఈ డైలాగ్సును విన్న చక్రపాణి 'మనవాడికి జడ్జి అయ్యే యోగం కూడా ఉన్నట్టున్నదే' అని లోలోన ఉబ్బిపోయాడు.

వెంగయ్య హత్య కేసు ఆరుమాసాలు జరిగింది. అందరూ అనుకొన్నట్లే ఎగిరి పోయింది ఎర్రగడ్డ పొట్టులాగా. భానుమూర్తి పేరు ప్రతిష్ఠలు నేల నాలుగు చెరుగులా ప్రాకిపోయినవి. పదిమందీ చూస్తుండగనే పట్టపగలే జరిగిన ఖూనీ కేసులో పిచ్చయ్య తప్పుకోవడమంటే సామాన్యమా?

జడ్జిమెంటును విన్న నాటిరేయి సరస్వతి జాగరణ చేసింది. ఈ పాపం నుండి భానుమూర్తిని తప్పించమని ఏడుకొండల వానిని వేడుకొన్నది. 'ఏడుకొండల వాడ శ్రీ వేంకటేశా! అలిమేలుమంగ శ్రీ ఆకాశగంగా' పాడుతూ పాడుతూ ఉన్నట్టుండి ఆఫీసు గదిలోకెళ్లి 'మీరేమైన చెప్పండి. ఈ పాపంలో ఏదో కొంత భాగం మీకూ ఉంది. తిరుపతికి వెళ్లి తలనీలాలిచ్చి దేవుని దర్శించుకొని హుండీలో కానుక వేసి ఆకాశగంగలో మునిగితే ఉన్న పాపాలతో పాటు అన్ని పాపాలూ పోతాయ'న్నది. భానుమూర్తి నవ్వుతూ 'వెళ్లి పడుకో నీ పిచ్చిగానీ' అంటూ యింకో కట్టనెత్తి ముందు పెట్టుకొన్నాడు.

ఆ మరునాడు సరస్వతి చాలా ఆలస్యంగా లేచింది. జానకమ్మ పలకరించినా పరధ్యానంగా ఉండిపోయింది. చక్రపాణిని చూచి వెక్కి వెక్కి యేడ్చింది. ఒళ్లు వెచ్చగా ఉంటే జ్వరం వచ్చిందేమోనని డాక్టర్ కోసం కబురంపారు. డాక్టరు వచ్చి విశ్రాంతి అవసరమని చెప్పి మందిచ్చి వెళ్లిపోయాడు. వారం రోజులు గడిచినా సరస్వతి పైకి లేవలేదు. ఎవరు పలకరించినా ఏదో ఏకాంతంలో నుండి ఉలిక్కి పడి సమాధానమిస్తుంటుంది. ప్రశ్నకు జవాబుకూ సంబంధమే ఉండదు.

'ఈ కాఫీ త్రాగవే ఉదయం నుండి గుక్కెడు మంచినీళ్ళయినా లేకుంటే ఏమవుతుందో తెలుసా?" జానకమ్మ బ్రతిమలాడుతూ అన్నది.

'ఆకాశగంగలో స్నానం చేస్తే అన్ని పాపాలు పోతాయి. ఉన్న డబ్బునంతా వెంకటేశుని హుండీలో వేస్తే...

'నిన్నేనే సరస్వతీ కాఫీ త్రాగమంటే ఏమిటీ నీ వాగుడు?' భుజాలను పట్టి

కదుపుతూ పైకి లేపింది జానకమ్మ. 'కాఫీనా' గట్టిగా నవ్వింది సరస్వతి. 'ఆ పాలు హంతకుని పైకంతో వచ్చిందా? కాఫీ పొడి గజదొంగ డబ్బుతోనా? చక్కెర కన్నెపిల్లను చెరచిన ఏ రౌడీయో యిచ్చిన రూకలతో...'

జానకమ్మ తల తిరిగిపోయింది. 'పడుకో పడుకో మాట్లాడకేం' అంటూ కూటంలోనికి వెళ్లిపోయింది. అప్పుడే జట్‌లో నుండి దిగిన భానుమూర్తి లోపలికి వచ్చి కోటూ గౌనూ మంచం కోడుపై పడవేశాడు.

'అబ్బీ... అమ్మాయి విషయం ఏదో చూడకుంటే...' జానకమ్మను మాట్లాడ నివ్వకుండానే 'ఆఁ డాక్టర్ చెప్పారులేమ్మా. అది హిస్టీరియా. ఉదయం మదరాసుకో వేలూరికో తీసుకెడితే అదే బాగవుతుందిలే' అన్నాడు భానుమూర్తి.

'హిస్టీరియానా? అంటే...'

'అదొక జబ్బులే. కాఫీ పట్టుకరా' అని పెరటిలోనికి దారితీశాడు భానుమూర్తి.

జానకమ్మలో ఆకస్మికంగా అర్థంకాని ఆందోళన ఆరంభమైంది. ఆట్టే వయస్సు మళ్లని ఆడవారికి అనేక రకాలైన జబ్బులు సంక్రమించడం ఆశ్చర్యం కాదు. ఇట్లా ఏవో ఏవేవో మాటలు మాట్లాడ్డం చేత గాలిసోకుడని ఆమె అనుమానం. అందుకు తగ్గ వారిచేత చికిత్స చేయించవచ్చు. లేదా చోళంగి పురానికి వెళ్లి అర్ధమండలం యోగ నరసింహస్వామికి సేవ చేయించినా నయం కావచ్చు. ఈ ఆలోచనతో కాఫీ కప్పు నందిస్తూ 'చూడు నాయనా చోళంగి పురానికి వెళ్లి కొండపాళెంలో వారం రోజులుండి వస్తాము. నువ్వు రావద్దుగానీ నేనూ మీ నాన్నా అమ్మాయిని తీసుకవెడుతాము. వారం రోజుల్లోనే స్వామి స్వప్నంలో కన్పించి ఎన్నాళ్లుండ వలసిందీ చెప్పేస్తాడు' అన్నది జానకమ్మ.

భానుమూర్తి కాఫీ త్రాగుతూ 'అంతా పిచ్చికాకుంటే స్వామి యేమిటి? స్వప్న మేమిటీ? నాన్నరాగానే వేకువన ప్రయాణమని చెప్పు. వేలూరికి పోదాం. కారు కూడా అడిగి పెట్టాను' అని చెప్పి ఆఫీసు గదికి వెళ్లిపోయాడు.

జానకమ్మ హృదయం చివుక్కుమన్నది. అసలు భానుమూర్తి పుట్టిందే ఆంజనేయస్వామి వరంతో. కొండపాళెంలో ఒక్క మండలం జానకమ్మ, చక్రపాణి సేవ చేశారు. ఒకరోజు నరసింహస్వామి కొండ నధిరోహించి యోగనరసింహ స్వామికి నూటయెనిమిది ప్రదక్షణాలు చేసి సేవించే వారు. ఇంకోనాడు ఆంజనేయస్వామి కొండనెక్కి యోగాంజనేయుడికి వందాయెనిమిది మార్లు

ప్రదక్షణాలు చేసేవారు. ఇట్లా కొండలెక్కి గుడులు చుట్టి పూజిస్తే జానకమ్మ స్వప్నంలో స్వామి వానర రూపంలో సాక్షాత్కరించి పెద్దజామ పండిచ్చాడు. ఆ మాసంలోనే గర్భం నిలిచింది. భానుమూర్తి కోసం ఆ దంపతులు పడ్డ తపన అలాంటిది. అట్లా పుట్టిన వాడే ఇప్పుడేం స్వామి అంటూ ఇష్టం వచ్చినట్టల్లా మాట్లాడుతున్నాడు. అయినా తానెవరు? ఏదో వేళకింత కబళం వేసింది తిని రామా గోవిందా అంటూ కాలక్షేపం చెయ్యాలి కానీ అబ్బాయి మాటకు అడ్డం చెబితే ఏముందిక?

ఆ రాత్రి చక్రపాణి చాలా దీర్ఘంగా ఆలోచించాడు. సరస్వతికి ఏ జబ్బూ లేదని అతని అనుమానం. ఆమెలో పాపభీతి అమితంగా ఉంది. కాఫీలో పాలు హంతకుని పైకంతో వచ్చింది. కాఫీ పొడి గజదొంగ పైకంతో కొన్నది. చక్కెర కన్నెపిల్లను చెరచిన ఏ రౌడీయో యిచ్చిన రూకలతోనో కొన్నది. అన్న ధోరణిలో అంతరార్థం యేమై ఉంటుంది? సరస్వతి ఇట్లా అన్నదని జానకమ్మ చెప్పినప్పటి నుండీ చక్రపాణి సతమతమై పోతున్నాడు. అసలు సరస్వతిలో యిల్లాంటి అనుమానాలు యెందుకు ప్రవేశించాయి? హంతకులు, రౌడీలు, గజదొంగలు, బ్లాక్‌మార్కెటీర్లు, లంచగొండులూ గుమ్మంలో అడుగు పెట్టడమే తనకిష్టం లేదు. ఆఫీసు గదిలో వెంకటేశ్వరుని బొమ్మను ఉంచడానికి సైతం ఆమె అత్మ అంగీకరించలేదు.

'ఇక్కడ దయ్యాల పటాలు, భూతాల బొమ్మలు, పిశాచాల నృత్య చిత్రాలను ఉంచాలి కాని దేవుని మూర్తు లెందుకు మామయ్యా' అని నవ్వుతూనే దేవస్థానం వారి కేలెండర్ని తీసుకెళ్లి కూటంలో తగిలించింది. 'వృత్తి ధర్మమంటే ఏమిటి? డాక్టర్ వున్న రోగాన్ని కుదర్చడమా? లేని రోగాన్ని సృష్టించడమా?' అని మొండిగా వాదిస్తుంది సరస్వతి.

చక్రపాణి యెక్కువగా చదువుకోలేదు. ఆంగ్లభాషా పరిచయ మత్యంత స్వల్పం. బారిష్టర్ గాంధీ నుండి భూలోభాయ్ దేశాయ్ వరకూ గుర్తుకు వచ్చారు. సత్యాన్ని గుర్తింప చెయ్యడానికి ఉచితంగా కోర్టులకు వెళ్లి వాదించిన న్యాయవాదు లెందరో ఉన్నారు. అబ్బాయిని అడిగితే 'హంతకుడు కోరినపుడు అతని పక్షం వకాల్తా పుచ్చుకోకపోవడం అన్యాయమంటాడు. అధర్మమనీ చెబుతాడు. ఏమిటో మరి చక్రపాణికి శరీరమంతా వేడెక్కిపోయింది. ఎవ్వరికీ లేని ధర్మసందేహం సరస్వతికే ఎందుకు పుట్టాలి? అసలు దీనినీ ఒక ధర్మసందేహమని చెప్పడంలో

ధర్మముందా? ధర్మమంటే ఏమిటి? ఇట్లా ఆలోచిస్తూనే మూడవ జాములో మెల్లగా కునుకు తీశాడు. కలత నిదురలో ఏదో కల. సరస్వతి ముఖం నిండుకూ పసుపు రాసుకొన్నది. పెద్ద తిలకం పెట్టుకొన్నది. కొత్త బట్టలతో లక్ష్మివలె కళకళ లాడుతున్నది. ఒక చేతిలో వీణె. మరో చేతిలో కామాక్షి దీపం! మెల్లగా అడుగుపై అడుగు వేస్తూ కడప దిగి వెళ్లిపోతున్నది. తానేమో బిగ్గరగా 'సరస్వతీ! సరస్వతీ' అంటూ రోదిస్తున్నాడు.

చక్రపాణి స్వప్నావస్థలోనే పెట్టిన కేకలకు జానకమ్మ మేలుకొన్నది. ఆమెకు స్వప్న వృత్తాంతాన్ని చెబితే ఇంకేమున్నది? 'ఏదో కలవరింతలే' అంటూ సరస్వతి గదివైపు వెళ్లాడు. ఆమె నిశ్చింతగా నిద్రపోతున్నది. జానకమ్మ కూడా సరస్వతిని చూచి వచ్చి పడుకొన్నది. చక్రపాణికి నిద్రపట్టలేదు. ఏదో యెరుగని ప్రమాదం ముందున్నదని అంతరాత్మ స్పష్టంగా హెచ్చరిస్తున్నది. అంతా భగవదేచ్ఛ అనుకొన్నాడు.

వేకువన నాలుగింటికే కారువచ్చి ఇంటి ముందు ఆగింది. బాషా సాహేబు కారు కేసులో భానుమూర్తి వకాల్తా పుచ్చుకొని ఉన్నందున సాహేబు గారు కారు పంపించారు. కారు క్రింద పడ్డవాడు అనామకుడేమీ కాదు. ఆరు మహడీలు అరవై ఎకరాల పంట పొలమూ వున్న పది లక్షల కుబేరుడు ప్రతాపయ్య కొడుకు. పుట్టిందీ ఒక్కడే. గిట్టిందీ ఒక్కడే. ఎంతైనా తగలబెడతాను ఉండి మాత్రం ఎవర్ని ఉద్ధరించడానికని కూచున్నాడు ప్రతాపయ్య. కర్మజాలక ఆ సమయంలో కారు నడిపింది డ్రైవరు కాడు. బాషా కొడుకు కాశిం. విధివిలాసం వాడూ తండ్రి కొక్కడే బిడ్డ. ఎటూ పోయిన వాడు పోయాడు. వీడుకూడా ఉరికంబ మెందు కెక్కాలని లోకం అంటున్నది. కాని డబ్బు గదా! ప్రతాపయ్య ఉన్న పదిలక్షలూ ఎవడనుభవించడానికి? సుప్రీంకోర్టు దాకా చల్లి పారేస్తా నంటున్నాడు. ఈ కేసు భానుమూర్తి చేతిలో పడింది. గనుక భయమే లేదని బాషా నమ్మకం. భానుమూర్తి నోరు తెరచి అడగాలి కాని కారును ఓ పూట కివ్వడమేమిటి ఉచితంగానే ఉంచుకోమని చెప్పగలడు బాషా. భానుమూర్తి పైకి చెప్పకున్నా మనస్సులో మాత్రం అనుకొనే ఉన్నాడు. డబ్బులిచ్చి కారును కొనే అవసరం తప్పింది. కాశిం బ్రతికి బయటపడితే అంతేచాలు. ఆ మాత్రం తాను చెయ్యగలడు. ఫస్ట్‌క్లాసు కారు రానే వస్తుంది. అసలది యాక్సిడెంటే కదా! ఊపిరి సలపకుండా ఆ కేసులోనే నిమగ్నుడయ్యాడు భానుమూర్తి. ఆనాడు కూడా అర్ధరాత్రి వరకూ

అదే కట్టను చూస్తున్నాడు.

ఉదయం ఐదింటికే కారు బయలుదేరింది. తొమ్మిదోగంటకల్లా ఆస్పత్రిలో అడ్మిషన్ పూర్తి చేశారు. కోర్టుకు వెళ్ళక తప్పదని భానుమూర్తి నాన్నగారి చేతికి రెండు వందలిచ్చి కారెక్కాడు.

సరస్వతి కొద్దిగా కోలుకొంటున్నట్లు కన్పించినా ఒంట్లో సత్తువ మాత్రం దిగజారి పోతున్నది. బాషా కారు అందుబాటులో నున్నా భానుమూర్తికి వ్యవధి లేదు. పరిసరాలలో పదిమైళ్ళ పరిధిలో నున్న సారా కేసులన్నీ తనకే వస్తున్నాయి. భానుమూర్తి ప్రతిభతో సారా వ్యాపారం కుటుంబ పరిశ్రమగా రూపొందినదని అంటే అతిశయోక్తి అనుకోరాదు. అతనికీ కేసులంటే నల్లేరుపై బండి. కేసులు చిన్నవైనా చిల్లరెక్కువ. అర్ధాంగిని విస్మరించి ఆదాయాన్నే చూస్తున్నాడని అనుకోరాదు. ఆమె వద్ద కూచొని మాత్రం చేయగలిగిందేముంది? తానెటూ డాక్టరు కాదు. ప్లీడరాయె. వృధాగా అమూల్యమైన కాలాన్ని వినియోగించడం అర్ధరహితమని అతని వాదం. ప్రతి సమస్యను హేతువాదంతో పరిష్కరించడం అతనికలవాటు. అయినా గుమాస్తాను రెండుమార్లు పంపించాడు. దేనికైనా మంచిదని మరో మూడు వందలు పైకం కూడా యిచ్చి పంపాడు.

పదిహేను రోజులు గడిచాక చక్రపాణి గుమాస్తాతో చెప్పి పంపడమే గాక రెండు జాబులు వ్రాసిన వెనుక భానుమూర్తి వేలూరికి ప్రయాణమయ్యాడు. ఆ రాత్రి ఎంతో బలవంతంతో అక్కడే ఆగిపోయాడు. సరస్వతి మాట్లాడుతున్నది కాని స్వరం మాత్రం చాల సన్నగిల్లింది. ఆమె మాటల్లో యెన్నో భావాలు దోబూచులాడు కొంటున్నవి. ఆశ్చర్యమేమంటే ప్రతి అయిదు నిమిషాలకూ ఆమె ఆకాశగంగను స్మరిస్తుంది. 'ఆకాశగంగ చల్లని తల్లి. అక్కడ స్నానం చేస్తే సర్వపాపాలు నాశనమవుతాయి. మీరు వెళ్లిరండి. నా మాట వినండి. వెంకటేశ్వరుడెంత మంచివాడనుకొన్నారు. ఏడుకొండలవాడు ఎంత చక్కని వాడు.'

'ఇంకా వుంది నాన్నా పిచ్చి. నెల రోజులైనా ఇక్కడే ఉండటం మంచిది' అన్నాడామె మాటలు విన్న భానుమూర్తి.

'పిచ్చి. పిచ్చి,అయ్యో తల్లీ! ఆకాశగంగా! అలిమేలు మంగా!..' అంటూ వెలవెల పోతున్న సరస్వతిని చూచి 'ఏడ్చావ్ పడుకో' అంటూ వెళ్లిపోయాడు భానుమూర్తి.

బాగా చదువుకోకపోయినా అమ్మాయి చురుగ్గా ఉందని ఆనాడు నాన్న గారి బలవంతాన అంగీకరించాడు కానీ మరీ యింత అధ్వాన్నంగా తయారవు తుందను కోలేదు భానుమూర్తి. అయినా అదే నయమవుతుందిలే అనుకొంటూ వెళ్ళి పడుకొన్నాడు.

ఉదయం ఎనిమిదింటికే ఊరికి వచ్చేశాడు. ఇంటి ముందు కారు ఆగింది. అన్ని తలుపులూ తెరువబడే వున్నవి. ఐదారు మంది పోలీసులున్నా రక్కడ. భానుమూర్తి ఆశ్చర్యంతో లోపల అడుగు పెట్టాడు. ఏముంది? అంతా అయి పోయింది. రెండు క్షణాలలోనే గ్రహించాడు. పాతికవేలు రొక్కం, భార్య నగలు, వంటగదిలో పాత్రలు, బీరువాలో బట్టలు... ఇదేం కలా యదార్థమా! రెండు కళ్ళూ నులుముకొని పరిశీలించి చూశాడు. నిజమే. అంతా అయిపోయింది. ఆఫీసులో గదిలో లా పుస్తకాలూ, ఫర్నిచరూ, రికార్డులూ తప్ప అంతే ఊడ్చేశారు.

భానుమూర్తి పట్టు తప్పి పేము కుర్చీలో చతికిలపడి పగిలిపోతున్న గుండెల్ని చిక్కబట్టుకొన్నాడు. చెమటపడుతున్నా నాలుక పిడచగట్టుకొని పోతున్నది.

'రాత్రి ఎప్పుడో జరిగినట్లుంది. ఉదయం తెలిసిందే పరుగెత్తుకొంటూ వచ్చామండీ' అన్నాడు కానిస్టేబుల్ ఎంతో సానుభూతిని వ్యక్తం చేస్తూ. భానుమూర్తి ఏమీ మాట్లాడకుండా ఇంటినంతా కలయ చూస్తున్నాడు. వీధి వైపే తాళాలను బ్రద్దలు కొట్టి లోపలికి ప్రవేశించినట్లు జాడలు కన్పిస్తున్నవి. అంతే అయి వుంటుంది. ఏం చెయ్యాలిప్పుడు? ఆ పాతిక వేలుతో పాటు ఈ పాతిక వేలనూ బ్యాంకిలోనే పడవేసి వుంటే ప్రమాదం తప్పి వుండేది. ఈ ఇన్‌కంటాక్సు వాళ్ళు ప్రాణాలను తోడేస్తారు. రొక్కం యింత పోయిందన్నా చిక్కే. అయినా ఏదో చెప్పి తప్పుకోవచ్చు. దేనికీ పోయినవన్నీ లిస్టు వేస్తే! ఎన్ననీ? ఏవేవనీ? పచ్చనోట్లూ బంగారం తప్ప గుడ్డా గుసురూ చెంబూ గిన్నెల విషయం తనకేం తెలుసు? దేనికీ అమ్మనైనా రమ్మంటే..... ఆమెకు తెలిస్తే కుప్పకూలి పోతుంది. ఇంతకూ ఈ దొంగల్ని పట్టేదెట్లా? ఈ పోలీసుల కంటే ఆ పోలీసు కుక్కలే నయం కదా? వాటిని తెప్పిస్తే?

'మీరు వచ్చాక లోపలెవరూ అడుగు పెట్టలేదు కదా?' ఉన్నట్టుండి ప్రశ్నించాడు భానుమూర్తి.

'లేదండీ' అన్నారు పోలీసులందరూ ఏకకంఠంతో. భానుమూర్తి ఒకసారి వారి ముఖాలవైపు చూశాడు. ఆ క్రితం మూడు రోజులకు ముందు నాటి రాత్రి

అనూరాధా వర్కుషాపులో నాలుగు బేరింగులు దొంగిలించిన అబ్బాయిని పోలీసులకు అప్పగిస్తే అబ్బాయినీ, బేరింగుల్ని, రిపోర్టునూ అదృశ్యం చేసి కూచున్నారని ఊరుఊరంతా ఒక్కటే గోలగా ఉంది. ఎవరినీ నమ్మడానికీ వీలుకాని దినాలివి. కంచెలు చేలను మేస్తాయని గోడలు పెడితే అవి కూడా దాడి చేస్తున్న అధ్వాన్నపు రోజులివి. అయినా తాను లాయరు. వారు పోలీసులు! ఎవరి వృత్తి ధర్మం వారిది!

'సరే. అంతా రికార్డు చెయ్యండి. తలుపులకు తాళం పెట్టి ఆ కుక్కల్ని తెప్పిదాం. ఆ:... మన యస్.పి.గారున్నారు కదా!'

'ఉన్నారండీ' మళ్ళీ ఏక కంఠంతో సమాధాన మిచ్చారు పోలీసులు. లాయరు వ్యవహారమిది. అందులోనూ భానుమూర్తి విషయం చెప్పాలా? ఆవులిస్తే ప్రేవుల్ని లెక్క పెట్టడమే కాదు. ప్రాగా తొలగితే చాలు పండినెరిసిన వెంట్రుక లెన్నో నెరిసిపోకుండా, మిగిలి ఉన్న నల్లని కురులెనో అంచనా వేసే అఖండ ప్రతిభా సంపన్నుడు భానుమూర్తి.

భానుమూర్తి ఇంటిలో దొంగలు పడ్డ విషయం దశదిశలా ప్రాకిపోయింది. దొంగల్ని పట్టుకొని శిక్షించకుండా సొమ్మును రాబట్టకుండా ఊరుకుంటాడా భానుమూర్తి! పోలీసులు అష్టకష్టాలు పడి గాలించి ఆచూకి తీసి రాబట్టిన సొమ్మునే గుర్తించడానికి వీలుకాని సొమ్మని మొండిగా వాదించి దొంగల కప్పజెప్పించిన భానుమూర్తి తన సొమ్ములనెలా గుర్తించగలడో చూడాలని నిరీక్షిస్తున్న వారూ లేకపోలేదు. భానుమూర్తి కోర్టులో విజృంభించి 'పేరు లేదు కనుక ఈ వెండి కంచం నీదేనని ఎలా చెప్పగల'వంటూ నిలదీసి అడిగిన రోజులున్నవి. మరో కేసులో ఈ పచ్చనోట్లపై నెంబర్లు తెలుసా? ఈ నోట్లు ఈ వందరూపాయల నోట్లు నీవేనని ఎట్లా చెప్పగలవని నాలుగువేలు పోగొట్టు కొన్న వెంకటేశాన్ని ఏడిపించి ఏడు చెరువుల నీళ్లు త్రాగించాడు. అత్యంత రహస్యమంటూ చెవుల్లోనే ఊదుకొన్నారు ఊరంతా! ఆ కేసును కొట్టివేస్తే ఆ నాలుగు వేలలో సగం భానుమూర్తిదని మాట చేసుకొన్నారంటారు. పాపం పుణ్యం భగవంతుడెరుగు. కానీ భానుమూర్తి యింట్లో పడ్డ దొంగలు మాత్రం ఆయన వకాల్తా పుచ్చుకొనే పార్టీలలో ప్రముఖులైన గజదొంగలేనని ఒక అపోహ వాడావాడా ప్రాకిపోయింది. దొంగలు మాత్రం అంత చెడ్డవారా? దేశమంతా చెడిపోయినంత బాగా వారు చెడిపోలేదే? తిన్న ఇంటికే వాసాలను లెక్కించేటంతటి ప్రజ్ఞా ప్రాభవాలు

వారికెలా అలవడినవి? ఆ విద్యను నేర్పే శిక్షణాలయా లెక్కడున్నవి? వారు కానే కాదనీ ఇటీవలనే సరిహద్దుల్లో నుండి వచ్చిన ఒక గజ దొంగల ముఠా ఈ పని చేసి వుంటుందని పోలీసుల వాదం!

భానుమూర్తి ఆ రోజుల్లా ఈ తతంగంలోనే పూర్తిగా మునిగి పోయాడు. మరునాడు పోయిన పాత్రలు బట్టలు తదితర వస్తు సరంజామానంతా లిస్టు వేయించుకు రావడానికి వేలూరికి వెళ్లాడు. సమయానికి చక్రపాణి లేడు. జానకమ్మ మాత్రం సరస్వతి మంచం వద్ద కూచున్నది. భానుమూర్తిని చూచి 'రా నాయనా' అంటూ లేచి నిలబడ్డది.

'అంతా పోయిందమ్మా' అంటూ కూర్చున్నాడు భానుమూర్తి. ఈ మాటల్ని విన్న సరస్వతి చివాలున లేచి కూర్చున్నది. 'ఏమిటి నాయనా అలా అంటున్నావ్?' ప్రశ్నించింది వెంటనే జానకమ్మ ఆత్రం పట్టలేక.

ఇంట్లో దొంగలు పడి అంతా దోచుకుపోయారన్నాడు భానుమూర్తి. 'పోయిందా! పీడా పోయింది. ఇప్పుడైనా ఆ మిగిలిందేమైనా ఉంటే ఏడు కొండల వాడి హుండీలో వేసి ఆకాశగంగలో మునిగితే ఆ మిగిలిన పాపం...'

ఉండలేకపోయాడు భానుమూర్తి. కుడి చేతిని బాగా వెనక్కి చాచి గూబపై ఒక్కటి అంటించాడు. అంత పశుత్వం భానుమూర్తిలో ఎలా ప్రకోపించిందో మరి! ఎక్కడో హృదయంలో మారుమూల సరస్వతి ప్రవృత్తిపై గూడు కట్టుకొన్న అసహ్యం అప్రీతి ఏవగింపు ఒక్కసారిగా విజృంభించినవి. జానకమ్మ పట్టుకొనే లోగానే సరస్వతి మరో చెంపపై ఫెళ్ళున కొట్టాడు. ఆ దెబ్బతో ఆమె స్పృహతప్పి మంచం మీద నుండి క్రిందికి ఒరిగిపోయింది. అప్పుడే హాల్లో ప్రవేశించిన నర్సు భానుమూర్తి రెండవ దెబ్బతో క్రిందపడ్డ సరస్వతిని జానకమ్మ సాయంతో యెత్తి మంచంపై పడుకోబట్టి నాడిని పట్టి చూచింది. ఆమెకు నాడి చిక్కలేదు. రెట్టించిన ఆందోళనతో డాక్టరు వద్దకు పరుగెత్తింది. ఇంతలో చక్రపాణి వచ్చాడు. అతన్ని చూడగానే జానకమ్మ బావురుమన్నది. భానుమూర్తి కంపిత హృదయంతో కిటికీ ఊచల్ని పట్టుకొని బాహ్య ప్రపంచం వైపు చూస్తూ నిలబడ్డాడు. ప్రాకారం గోడపై అయిదారు కాకులు పిచ్చుక పిల్లను ప్రాణంతోనే చీల్చి వేస్తున్నవి. చూస్తుండగానే పిచ్చుక రెండు ముక్కలైనది. ఆ ముక్కల్ని ముక్కులతో కరచుకొన్న కాకులు పైకి లేచినవి. మిగిలినవి వాటిని అనుకరించాయి.

చక్రపాణి ప్రశాంతంగా నిదురపోతున్నట్లున్న సరస్వతి వైపు దృష్టిని సారించి

శిలా కుడ్యం వలె నిలబడి పోయాడు. డాక్టర్ సరస్వతిని పరీక్షించి అటూ ఇటూ చూచి నిశ్శబ్దంగా వెళ్లిపోయాడు. నాలుగైదు నిమిషాల్లోనే ఆసుపత్రి పరివార మంతా చేరి పోయారక్కడ. భానుమూర్తి ఆ గుంపులో నుండి తప్పుకొని కారు దగ్గర నిలబడ్డాడు. డ్రైవరు తన్ను సమీపించగానే నాలుగువంద రూపాయల నోట్లతో పాటు పర్సులోనున్న చిల్లరనంతా అతని వద్ద యిచ్చి 'నాన్నగారి దగ్గరిచ్చిరా' అన్నాడు. అతడు లోపలికి వెళ్ళగానే తానా వైద్యశాల నుండి నిష్క్రమించాడు.

సరస్వతి హత్య చేయబడినట్లు స్పష్టంగా గ్రహించిన డాక్టరు పోలీసులకు కబురు చెయ్యకుండా ఉండలేకపోయాడు. హంతకుడామె పురుషుడే కావడం పైగా విద్యావంతుడై ఉండడం అందులోనూ మంచి లాయరుగా పేరు మోసిన వాడు కావడం అందరికీ అమితమైన ఆశ్చర్యాన్ని కల్గించినవి.

ఆస్పత్రితో పాటు అన్ని వాడలూ గాలించినా హంతకుని జాడ తెలియ రాలేదు. అతడు పరారీ అయినట్లు ద్యోతకమైనది. శవపరీక్షానంతరం చక్రపాణి శవాన్ని తీసుకపోయాడు. జానకమ్మ అన్ని బరువులనూ మోసే భూదేవి వలే మౌనంతో వెంబడించింది.

ఇల్లు తాళం వేయబడి ఉన్నా చక్రపాణి పగులగొట్టించాడు. దొంగలు పడ్డ కొంపలో అస్తమించిన గృహలక్ష్మిని చూచిన ఇరుగు పొరుగు వారు ఎన్నో వ్యాఖ్యానాలు చేశారు. లోకంపోకడ అట్టిది. ఎవరి కర్మ వారిదన్నారంతా! కాని అందరి కళ్లూ భానుమూర్తి కోసం కలయ జూచాయి. చక్రపాణి ఎంతటి సత్యవాది అయినా ఆ సమయంలో చిన్న అబద్ధమాడక తప్పలేదు. భానుమూర్తి అర్జంటు పనిమీద హైదరాబాదు వెళ్ళిపోయాడనీ అతడు వచ్చే వరకూ శవాన్ని అట్టే ఉంచడానికి వీల్లేదని అన్నాడు. సరస్వతికి తల్లిదండ్రులు లేకపోయినా అన్న నాగపూరులో ఉద్యోగం చేస్తున్నాడు. అతడూ రాలేదని తేలిపోయింది. ఉన్న బంధువులూ మిత్రులూ కలిసి సరస్వతి శవాన్ని దహనం చేశారు.

ఎట్లా తెలిసిందో చెప్పలేము కాని కాటిలో పూర్తిగా శవం తగలబడక ముందే భానుమూర్తియే భార్యను కొట్టి చంపాడని ఊరంతా పొక్కి పోయింది. ఈ వార్త నిజం కాదని అనేక మంది వాదిస్తున్నా నిజమేనని భానుమూర్తియే స్వయంగా పోలీసు స్టేషనుకు వెళ్లి స్టేట్‌మెంటు యిచ్చినట్లు తెలిసి ఊరంతా విస్తుపోయారు. ఆత్మహత్యకే తలపడ్డ భానుమూర్తి తన నేరాన్ని ఒప్పుకొని శిక్షను అనుభవించడమే యుక్తమని తోచి ఊరికి వచ్చి పోలీస్ స్టేషన్లో కబురు చేశాడని

కూడా కొందరన్నారు. చక్రపాణికీ ఉదంతం తెలిసిన వెనుక కొడుకును కలుసుకొన్నాడు. భానుమూర్తి ఎంతో నిగ్రహంగా కన్పించాడు. "బ్యాంకులో డబ్బున్నది. కర్మనంతా సక్రమంగా జరిపించండి. అమ్మను దిగులు పడరాదని చెప్పండి." అని మాత్రం చెప్పాడు. జానకమ్మ జైల్లో కొడుకున్న గదిని తన కన్నీటితో కడిగి వెళ్ళిపోయింది. భానుమూర్తి మిత్రులెందరో వచ్చారు. కాని అతని దృష్టిని మరల్చలేకపోయారు.

కర్మ జరిగిపోయింది. ఇంటిలో పడ్డ దొంగల ఆచూకి మాత్రం దొరకలేదు. పోలీసుల పరిశోధన సాగుతూనే వున్నది. డాక్టరు సర్టిఫికెట్ యిచ్చాడు. నర్సు సాక్ష్యం యిచ్చింది. ఆమె సాక్ష్యంలోను జానకమ్మ సాక్ష్యంలోను భానుమూర్తి కోపం వచ్చి కొట్టాడనీ, రెండే దెబ్బలనీ చెప్పారు. నేరం నేరంగానే కన్పించింది. భానుమూర్తి తాను కొట్టినది సత్యమేనని ప్రకటించాడు. న్యాయమూర్తి భానుమూర్తికి నాలుగేళ్లు కఠిన శిక్ష విధించాడు. హత్య ఉద్దేశ పూర్వకమైనది కాదని పేర్కొన్నా సరస్వతి ప్రాణం పోవడానికి భానుమూర్తి దెబ్బలే కారణమైనందున నాలుగేళ్లు కఠిన శిక్ష విధించడ మైనదన్నారు.

పండంటి కాపురం ఇట్లా బ్రద్దలవుతుందని ఎవరనుకొన్నారు? వెన్నపడే తరుణంలో భాండమే బ్రద్దలైపోయింది.

ఏ దేవుడైతే భానుమూర్తిని ప్రసాదించాడో ఆ దేవుడే వాడిని రక్షించి మనకు అప్పజెప్పాలన్నాడు చక్రపాణి. 'మనం ఈ ఊళ్లో బ్రతకలేము. పూలమ్మిన చోట కట్టెలమ్మి జీవించగలమా? ఆ కొండపాళానికే వెళ్లి ఏదో సత్రంలో తలదాచుకొని ఆ స్వామికి ఈ నాలుగేళ్లూ సేవ చేద్దామన్నది జానకమ్మ. ఈ ఆలోచన బాగానే ఉన్నట్టు కన్పించింది చక్రపాణికి. అంతకంటే గత్యంతరం లేదు. ఇంటిని ఖాళీ చేయడానికి సామాన్లుంటేగా! అన్నీ దొంగలే ఊడ్చేశారు. అలా పుస్తకాలూ, కుర్చీలూ, మేజా, మంచం వగైరాలను ఎదురింటి గోపాలయ్య కప్పజెప్పి జానకమ్మ చక్రపాణీ కట్టుబట్టతో ఘటికాచలం రైలెక్కారు.

భానుమూర్తి చెఱసాలలో నిబ్బరంగా కూర్చున్నాడు. నెలకోమారు జానకమ్మ, చక్రపాణి జైల్లో నున్న భానుమూర్తిని కలుసుకొంటూనే వున్నారు. భానుమూర్తిలో బాహ్యంగా కన్పించని అదృశ్య శక్తి ఏదో తన ప్రభావాన్ని విస్తృత పరచుకొంటున్నది. పైకి మాత్రం లౌకిక దృష్టితో ఆప్యాయంగా తల్లిదండ్రుల్ని లాలించి పంపుతున్నాడు.

అసలీ జీవితానికి నిర్వచన మేమిటి? చావుపుట్టుకల అంతర్యమేమిటి? దేవుడున్నాడా? ఉంటే ఎందుకు కన్పించడు? అసలు దేవుని చూడాలనే ఆలోచన తన కింతవరకూ పుట్టలే దెందుకు? దేవుడు తిరుపతిలోనే ఉన్నాడా? పాపాన్ని నశింపజేసే శక్తి ఒక్క ఆకాశగంగకే ఉన్నదా? తాను ఘటికాచలం యోగాంజ నేయుని వరప్రసాదంతో జన్మించినట్లు అమ్మ చెప్పిన మాట నిజమేనా? ఇల్లాంటి ప్రశ్నలు వందలు, వేలు లక్షలు! హృదయాంబుధిలో దధిమర్దనమే జరుగు తున్నది. అవతరించనున్నది అమృతమో! హాలాహలమో! బాధ. ఏదో బాధ. అమితమైన బాధ. అనిర్వచనీయమైన బాధ. ఆ భరింపరాని బాధలో నుండి ప్రభవించగలిగిన దేమివున్నది? ఒక్క భక్తి మాత్రమే గదా! భానుమూర్తి బందిఖానాలో భక్తి అనే సూత్రంతో బంధించబడి తన హృదయ మందిరంలోనే భగవంతుని పట్టి బంధించడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. ఎవ్వరికీ తెలియని, చెప్పినా అర్థం కాని అంతరంగికమైన ఈ అంతర్యుద్ధంలో అతడెన్నో అనుభూతులను పొందగలిగాడు. అనుభవాల నధిగమించిన ఆ యనుభూతుల్లో అతడనేక సంశయాలను తీర్చుకోగలిగాడు.

సరస్వతి ప్రతి రాత్రీ కాకపోయినా రెండుమూడు రోజులకొకసారి కన్పిస్తూనే వున్నది.

'ఏడుకొండలవాస శ్రీ వేంకటేశా

అలిమేలుమంగ ఓ ఆకాశగంగా! ఆకాశ గంగా...' తన వీణారవంతో ఈ పాటను విన్పిస్తూనే వున్నది స్వప్నానుభూతుల్లో. తాను సందర్శిస్తున్న ఈ సత్యాన్ని అతడు లోకానికి చెప్పలేదు. చెబితే నమ్మేవారున్నారా? ఉంటారా? జైలరు సానుభూతి వహించినా అధికారులంతా ఆదరించినా భానుమూర్తిలో మార్పు లేదు. అతడు పరధ్యానంలో గత జీవితంలోని సంఘటనల నుండి గుణపాఠాలను గుర్తించుకొంటున్నాడు. స్వప్నాలలో భావి జీవితంలోని దివ్య సన్నివేశాలను సందర్శిస్తున్నాడు.

కాలచక్రంలో నాలుగేండ్లు అంతవేగంగా దొర్లిపోగలవని భానుమూర్తి అనుకోనే లేదు. అతని సత్ప్రవర్తన కారణంగా నలభై రోజులకు ముందే అధికారులు విడుదల చేశారు. ఈ విషయం చక్రపాణికి జానకమ్మకు తెలియదు. భానుమూర్తి బాహ్య ప్రపంచంలో అడుగు పెట్టినా అతనిలో ఎట్టి ఆనందమూ అంకురించలేదు. దైన్యమూ ప్రవేశించలేదు. ఆ స్థితప్రజ్ఞత ఎట్లా అలవడినదో

అతనికే ఆశ్చర్యం! తనకీ లోకంతో పనిలేదు. తనతో ఈ లోకానికి ప్రయోజనమున్నా తాను మునుపటి వలె ఉపయోగపడాలని అనుకోలేదు. తాను నడిచిపోతున్న దారి నిజానికి ఏ వైపునకు వెడుతున్నదో! తనకు తెలియకనే నడుస్తున్నాడు. చివరికాదారిలో వెడుతున్న బస్సును చూచి అది తిరుపతి రోడ్డేనని తెలుసుకొని ఆశ్చర్యపోయాడు. సరస్వతి ఏం చెప్పింది? వేంకటేశ్వరుని హుండీలో కానుకవేసి ఆకాశగంగలో స్నానం చెయ్యమన్నది. ఆమె చనిపోయిన వెనుక ప్రతి కలలోనూ ఈ మాటే చెబుతున్నది. ఆమె చనిపోయినా ఆమె కోర్కెను తీర్చడం తన కర్తవ్యం! అందుకేగా ఈ నాలుగేళ్లూ జైల్లో ప్రాణాలను నిల్పుకొన్నది. అసలామె చని పోయిందా? చనిపోయిన వారు మళ్లీ స్వప్నాలలో ఎట్లా కన్పిస్తారు? మూడు మాసాల క్రితం జైలు గవాక్షంలో నుండి క్రిందికి జారుతున్న త్రాచును చూపి 'అదిగో పాము పాము' అని గొంతెత్తి అరచినపుడే గదా తాను మేల్కొన్నాడు. ఎంతటి అపూర్వ సంఘటన నాది! బారెడు నల్లని వాగు. క్షణ మాలస్యమై ఉంటే తన్నే కాటు వేసేదేమో?

ఇంతకూ బ్రతికి వున్న వారెవరు? చనిపోయి బ్రతికి ఉన్న వారెవరు? బ్రతికి ఉండీ చనిపోయిన వారెవరు?

భానుమూర్తి పాదాలు నొప్పి పుట్టే వరకూ నడిచాడు. పొద్దు గూకింది. సద్దు మణిగింది. అప్పుడేదో కొద్దిగా ఆకలి వేసింది. అంతమేరా నడిచిన వాడికి కనుచూపు మేరలో కన్పించే జనపద మేమంత దూరమని అన్పించలేదు. అన్నం ఎవరు పెడుతారు? తిన్న ఇంటికే కన్నవేసిన దొంగలకు వకాల్తా పుచ్చుకొని ఉన్న పున్నెమును కూడా ఊడగొట్టుకొన్న తనకు అన్నం ఎవరు పెడతారు?

దట్టంగా ఎదిగి వున్న గడ్డం! బక్కచిక్కిన శరీరం! నాలుగేళ్ల నాడు విడిచిన పంచ, పల్చని లాల్చీ! ఆ వేషం ఏమంత దర్పమైనది కాదు. దయనీయమైనదే. అయినా అడిగితే తప్పేముంది? అడగడం న్యాయమే. అధర్మమేమీ కాదు. అనుమానాన్ని వదిలి ఆ వీధి మొగుదల యింటి ముందే నిలబడి అడిగాడు. ఆ ఇల్లాలు అన్నపూర్ణ కాకుంటే ఆకునిండుకూ అన్నం తెచ్చిపెడుతుందా! ఆశ్చర్యమే మరి! వెడుతున్నది తిరుపతి కైనపుడు ఏడుకొండల వాడికా మాత్రం కరుణ లేకుండా ఉంటుందా? ఎంతో హాయిగా ఆరుబయట వెన్నెల్లో పడుకొన్నాడా రాత్రి. మూడవ జాములోనే మేలుకొని చకచకా నడక సాగించాడు. సమాధి స్థితిలోని క్రమాను గత సోపానముల వంటి ఏడుకొండల దారి కాదు అదృష్టవశాత్తు

దైవానుగ్రహంతో ఉన్నట్టుండి ఆత్మసాక్షాత్కారం లభించే మార్గం వంటి దగ్గరి రహదారి. మంగాపురం దోవ. శ్రీవారి మెట్ట. అలా అలాపైకి వెళ్ళిపోయాడు. అలసట కన్పిస్తేనా! ఆ వైపు నుండే ఆహ్వానించింది బంగారు కోనేరు. తలనీలా లివ్వడానికి కట్నం? బిచ్చమెత్తితే తప్పా! భిక్షాటనతో యాత్ర చేసిన వారెందరు లేరు! గంటసేపటికే కట్నానికి కావలసినంత కంటే ఎక్కువ పైసలే లభించాయి. మిగిలిన పది పైసలకు కర్పూరం చాలు. అదే పదివేలు. తలనీలాలు సమర్పించి బంగారు కోనేరు వద్దకు వచ్చాడు. ఎందరున్నారక్కడ? వారి విశ్వాసాన్ని ఏమనాలి? తానూ వారిలో ఒక్కడు. కోనేటిలో మునిగాడు. ధర్మ దర్శనం లభించింది. ఎంత చక్కని వాడు ఏడుకొండలవాడు! సరస్వతి పక్కనే నిల్చొని పాడుతున్నది. అదే పాట. ఆ వీణారవమే! భ్రమా! తిరిగి చూచాడు. ఆమె లేదు. ఎందుకు లేదు? ఉంది. ఉంది. ఆ భావనతోనే హుండీ వద్దకు వచ్చాడు. సరస్వతి అన్నది కదా హుండీలో కానుక వెయ్యమని! పెళ్ళినాడు అత్తగారిచ్చిన ఆ ముద్దుటుంగరాన్ని అందుకే ఉంచుకున్నాడేమో! భానుమూర్తి ఉంగరాన్ని హుండీలో వేశాడు. సరస్వతి చిరునవ్వుతో సాక్షాత్కరించింది. ఎంత సుదినమిది!

ఇంకేముంది? ఆకాశగంగ! అన్నం మాటనే మరచిపోయాడు. ఆకలి ఉంటేనా? ఒక్క ఊపుతో ఆ దిక్కుకేసి నడిచాడు. అదే... ఆ.... ఆకాశగంగ! ఆ చిన్ని జలపాతస్వరం సరస్వతి మధురగళాన్నే గుర్తుకు తెస్తున్నది. 'సరస్వతీ స్నానం చేస్తున్నాను. ఆకాశగంగలో స్నానం చేస్తున్నాను. అన్ని పాపాలు పోయినట్లేనా?' అన్నాడప్రయత్నంగా భానుమూర్తి. సరస్వతి కిలకిలమని నవ్వుతున్నది. ఆకాశ గంగ గలగలమని దుముకుతున్నది. ఆమె శ్రుతులను మీటి ఆలాపిస్తున్నది, 'ఏడుకొండల వాస' అదే పాట.

భానుమూర్తి బట్టల్ని పిండుకొన్నాడు. లాల్చీ నాలుగు గోచీలైంది. అక్కడే అతి సమీపంలో వటవృక్షచ్ఛాయలో ఆశీనుడయ్యాడు. ఎవరో యాత్రికులు ఆ ముందుంచినదేదో తనకు తోచినపుడు తింటాడు. ఉదయ సంధ్యల్లో నియమం తప్పక ఆకాశ గంగలో మునుగుతూనే వుంటాడు. పాపం! ఆ తల్లితండ్రులెలా ఊహించారో? జైలు నుండి వెళ్ళిపోయాడని తెలిసి పసిబట్టినట్టు ఏడుకొండల నెక్కి వెంకటేశ్వరుని దర్శించి ఆకాశగంగలో సుస్నాతులై ఆ పరిసరాలను గాలిస్తున్నారు.

భానుమూర్తి వచ్చాడు. స్నానం చేస్తున్నప్పుడే గుర్తించి కౌగిలించుకొన్నది

తల్లి. చక్రపాణి ఎంతో ఆప్యాయంగా పలకరించాడు. అతడు మాట్లాడలేదు. ఎంత బ్రతిమలాడినా మాట్లాడితేగా. సమీపంలో కూర్చున్న సాధువు చెప్పారు, 'ఆయన మహాయోగి ఎందుకు ఇబ్బంది పెడతారు? ఎవరితోనూ మాట్లాడడ'ని. 'నేను తల్లినే, నేను తండ్రినే' అని మొత్తుకొన్నారిద్దరూ. ఎవరో బిచ్చగాడు తంబుర మీటుతున్నాడు.

'తల్లి ఎవరో తండ్రి ఎవరో తనయుడెవరో మనసా!

తాను ఎవరో దైవమెవరో కానగలమా మనసా!

ధర్మమేదో న్యాయమేదో సత్యమేదో మనసా' పాట విన్పిస్తూనే వుంది. ఆకాశ గంగ ప్రణవస్వరంలో క్రమక్రమంగా లీనమవుతున్న ఆ పాటతో పాటు చక్రపాణి మంచు కరిగినట్లు ద్రవించిపోతున్నాడు. జానకమ్మ సెలయేరు ప్రవహించినట్లు స్రవించిపోతున్నది.

పద్మాసనా శీనుడైన భానుమూర్తి దక్షిణామూర్తి భాతి జ్వాజ్వల్య మానుడై భాసిస్తున్నాడు వటవృక్షచ్ఛాయలో.

సరస్వతి కంఠస్వరం మాత్రం ఆకాశగంగ గలగలారవములో స్పష్టంగా విన్పిస్తున్నది.

'ఏడుకొండల వాస శ్రీ వేంకటేశ

అలివేలుమంగా ఓ ఆకాశగంగా! ఆకాశగంగా! ఆకాశగంగా!'